## క్లుప్తంగా

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మఠంపల్లి : మండలంలోని క్రిష్టాతండాకు చెందిన వీడ్కోలు కొండాచారి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబానికి ఆచార్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తంగెళ్లపల్లి విద్యాసాగర్ రూ.10వేల ఆర్థికసాయాన్ని మట్టపల్లి విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు ఉద్దోజు సూర్యనారాయణచారి ద్వారా మంగళవారం అందజేశారు.

### నోట్ బుక్స్, ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్, ప్యాడ్లు పంపిణీ చేస్తున్న పెనుయేలు సంస్థ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని హరిజన కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెనుయేలు వర్షిప్ సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పెన్నులు, నోట్ బుక్స్, ప్యాడ్లు అందజేశారు. పెనుయేలు సంస్థ అధ్యక్షుడు జె.సామ్యూల్, సభ్యులు ఎం.రాజేష్, జి.ప్రవీణ్, జి.ప్రభాకర్, జె.ఉష, కె.సైదులు, ఉదయ్, లాజర్, ఓంకార్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుల నియామకం

హుజూర్‌నగర్ : వైఎస్సార్ తెలంగాణ పార్టీ మేళ్లచెరువు, నేరేడుచర్ల మండలాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జల్లెపల్లి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళ్లచెరువు మండల అధ్యక్షుడిగా రామాపురంనకు చెందిన అన్నూరి పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ జానివియా, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, నేరేడుచర్ల మండల అధ్యక్షుడిగా సోమారం గ్రామానికి చెందిన డాక్టర్ ఎంఏ గఫార్‌ను పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలతో నియమించినట్లు తెలిపారు.

### టెండర్ లేకుండానే పాత సామగ్రి విక్రయం

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని పాత సామగ్రిని టెండర్ పిలవకుండా బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారని మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి వంశీ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాఠశాలలోని విలువైన కంప్యూటర్ సామగ్రి, ఇనుప పెట్టెలు, ఇనుప బల్లలు, ర్యాకులు, ఫైర్ సేఫ్టీ సిలిండర్లు, బయట విక్రయించారని ఆరోపించారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మీని వివరణ కోరగా ప్రతి విద్యా సంవత్సరం సొసైటీ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే పాత సామగ్రిని విక్రయిస్తుంటామని తెలిపారు.

### వైద్యాధికారిపై ఫిర్యాదు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం అందిస్తున్న ప్రభుత్వ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్.రవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎం.సాయికృష్ణ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన కాపీలు స్థానిక వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొడుతున్నాయి. డాక్టర్.రవి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులను ఆ ప్రైవేటు ఆస్పత్రికి పంపుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై డాక్టర్.రవిని వివరణ కోరగా అన్ని అనుమతులున్న ఆ వైద్యశాలలో తాను అప్పుడప్పుడు కన్సల్టెన్సీ డాక్టర్‌గా పని చేస్తున్నట్లు తెలిపాడు.

### ఒకే సెంటర్‌లో పరీక్షలు నిర్వహించాలి

మునగాల : గురుకుల పరీక్షల అభ్యర్థులకు ఒకే సెంటర్‌లో పరీక్ష నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మల్టీ పర్పస్ పరీక్ష సెంటర్స్ విధానాన్ని రద్దు చేసి పరీక్షా కేంద్రాలను స్థానిక జిల్లాల్లోనే ఏర్పాటు చేయాలని టీయూడీఎఫ్ జిల్లా కన్వీనర్ జె.నర్సింహారావు కోరారు. మంగళవారం మునగాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల విద్యాలయాల్లో జేఎల్, డీఎల్, టీజీటీ, పీజీటీ, లైబ్రేరియన్ ఉద్యోగ నియామక పరీక్షల కోసం ఆగస్టు 1 నుంచి 23 వరకు ప్రభుత్వం నిర్వహించే పరీక్ష విధానంలో ఒకే అభ్యర్థికి మూడు, నాలుగు జిల్లాలో సెంటర్లు కేటాయించడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.

### ఉత్తమ్ దంపతులపై అసత్య ప్రచారం మానుకోవాలి

నడిగూడెం : నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారని పలువురు చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ప్రచారం చేయడం తగదన్నారు.

### అంబులెన్స్ మంజూరుపై హర్షం

నడిగూడెం : నడిగూడెం ప్రభుత్వ వైద్యశాలకు ప్రభుత్వం అంబులెన్స్ మంజూరు చేయడంపై జెడ్పీటీసీ బాణాల కవిత, ఎన్ఆర్ఐ, బీఆర్ఎస్ నాయకుడు జలగం సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత నెలలో మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం ఇవ్వడంతో అంబులెన్స్ మంజూరైనట్లు సుధీర్ తెలిపారు.

# రెండేళ్లైనా స్లాబ్ దశలోనే..

- నత్తనడకన ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో జాప్యం
- త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలంటున్న ప్రజలు



గణపవరంలో స్లాబ్ లెవల్‌లోనే నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం

కోదాడరూరల్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పదివేల జనాభాకు ఓ ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో వైద్య సిబ్బంది విధులు నిర్వహించేందుకు భవనాలు లేవు, ఉన్న చోట పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పదివేల జనాభాకు తగినట్లుగా మూడు నాలుగు గ్రామాలకు కూడలిలో ఉన్న, మేజర్ గ్రామంలో భవనం నిర్మాణం చేపట్టతలిచారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ఫండ్ నుంచి ఒక్కో భవనానికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మండలంలోని గణపవరం, దొరకుంట, నల్లబండగూడెంలో ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనాలు నిర్మించేందుకు గత ఏడాది జనవరిలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇంకా స్లాబ్ దశలోనే నిలిచిపోయాయి. అయితే నడిగూడెంలో మండలంలో మరో కాంట్రాక్టర్ చేపట్టిన పనులు పూర్తై ఆ భవనం ప్రారంభానికి కూడా సిద్ధమైంది. కానీ కోదాడ మండలంలో మూడు భవనాల పనులు ఇలాగే కొనసాగితే మరో ఏడాది సమయం పట్టిన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.

**మొదట్లో చకచకా జరిగినా..**

పనులు ప్రారంభించిన ఆరు నెలల్లో పూర్తి చేసి సిబ్బందికి అందుబాటులోకి తేవాల్సి ఉన్నా కాంట్రాక్టర్‌లు పలు కారణాలతో పనుల్లో జాప్యం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నల్లబండగూడెంలో మొదట్లో పనులు చకచకా జరిగి ఆరు నెలల్లో స్లాబ్ వేశారు. అంతటితో పనులు నిలిచిపోయాయి. దొరకుంటలో విద్యుత్ సమస్యతో భవనం అంతర్గత పనుల వద్ద నిర్మాణం ఆగింది. ఇక గణపవరంలో కాంట్రాక్టర్ మరో వ్యక్తికి సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వడంతో అక్కడ స్లాబ్ వద్ద పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు పనులు వెంటనే ప్రాంభించి నూతన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతో నిర్లక్ష్యం**



పనులు వెంటనే పూర్తి చేస్తామని సంవత్సరం నుంచి చెప్తున్నారు. అయినా నేటివరకు పనులు స్లాబ్ వరకే పరిమితమయ్యాయి. కాంట్రాక్టర్ చేయకుండా మరో వ్యక్తి సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతో పనుల్లో ఇంకా నిర్లక్ష్యం జరుగుతోంది. గ్రామంలో సబ్‌సెంటర్ లేకపోవడంతో వైద్యసిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– పొట్టా శ్రీవిజయకిరణ్, సర్పంచ్, గణపవరం

**నాలుగు నెలల్లో పూర్తి చేయిస్తాం**

కోదాడ మండలంలో నిర్మిస్తున్న మూడు భవనాల పనులు కొన్ని సమస్యలతో నిలిచిపోయాయి. నల్లబండగూడెంలో ప్లాస్టింగ్, దొరకుంటలో టైల్స్ పనులు చేయాల్సి ఉంది. గణపవరంలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనుల్లో వేగం పెంచి మూడు నాలుగు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– అనుదీప్, టీఎస్ఎం, ఐడీసీ ఏఈ, కోదాడ

## కార్పొరేట్ శక్తులకు దాసోహమైన ప్రభుత్వాలు

గరిడేపల్లి : కార్మిక చట్టాల కోసం పోరాడటంతో పాటు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని వ్యతిరేకించేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు తురక శ్రీను అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ఐఎఫ్‌టీయూ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పోరాట ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాలుగు చట్టాలుగా చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యాయని ఆరోపించారు. హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాకు కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల అంజయ్య, బత్తుల నరేష్, చిన లింగయ్య, పెద్ద లింగయ్య, కామళ్ల సుందరయ్య, ఏడుకొండలు, పిచ్చయ్య, సైదులు, గుంజ వెంకటేశ్వర్లు, చిన వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయం

మునగాల : మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు మహిళా జడ్జిలు, నిపుణులతో కమిటీ వేసి సిట్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని సుప్రీంకోర్టు సీజేఐ చంద్రచూడ్ పేర్కొనడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు దేశంలో ఎక్కడ పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సత్యనారాయణ పేర్కొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్. వైఎస్.రాజశేఖరరెడ్డి అభిమానులు మంగళవారం కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమానులు, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి ప్రవంతీకిషోర్‌రెడ్డి, గాదె జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మఠంపల్లిలో వైఎస్సార్ వర్ధంతి, జయంతి వేడుకలను ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగానే ఇడుపులపాయకు వచ్చి పాస్టర్ల పర్యవేక్షణలో ప్రార్థనలు చేశామన్నారు. వారివెంట వైఎస్సార్ అభిమానులు తుమ్మా థిల్లీప్‌రెడ్డి, తుమ్మా ధీరజ్‌రెడ్డి, టీఆర్ బాలశౌరిరెడ్డి, చిన్నపురెడ్డి, మహిళలు ఉన్నారు.

## న్యాయవాది మృతికి సంతాపం



ఇస్మాయిల్ మృతికి సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

కోదాడఅర్బన్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఆయన ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలూ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల కోదాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో ఐలూ జిల్లా కన్వీనర్ వేజెళ్ల రంగారావు, సీనియర్ న్యాయవాదులు పాలేటి నాగేశ్వరరావు, కృష్ణయ్య, రంజాన్‌బాషా, ముల్కా వెంకటరెడ్డి, నర్సింహారావు, కొండల్‌రెడ్డి, నర్సయ్య, గోవర్ధన్, పాషా, శరత్, కోదండపాణి, నవీన్ శ్రీధర్, చలం, హేమలత పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

నేరేడుచర్ల : పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏనిమిదేళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు చేస్తుంటే పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. సమావేశంలో పేదల ఇళ్ల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు వాస పల్లయ్య, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, కరుణాకర్, సత్య, పావని, మరియమ్మ, శ్యామల, లక్ష్మి, శ్రీను ఉన్నారు.

## కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

మఠంపల్లి : దేశంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తరిమిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఎదుర్కొని దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రఘునాథపాలెంలో జరిగిన ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సిమెంట్ ధరలను తగ్గించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం కార్మికుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామ శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సన్నెగుండ్ల జాన్, పెద్దజాన్, అలీబాబా, హుస్సేన్, బాలసైదా, వెంకటసుబ్బారావు, ఐదుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మండల కార్యదర్శి అమరారు పున్నయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష, సిబ్బంది

కోదాడఅర్బన్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ కోదాడ డిపోలో మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. డిపో కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన హక్కులను కాలరాసేందుకు బీజేపీ కుట్ర

పాలకవీడు : గిరిజన హక్కులను కాలరాసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శి కెళావత్ మధు నాయక్ ఆరోపించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వ్యాఖ్యలు చేసిన ఎంపీ సోయం బాపురావుపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పాలకవీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాపురావు పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసి పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమాన్‌నాయక్, ఆర్‌పీ నాయక్, శివనాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోతె : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రమేష్ అన్నారు. మంగళవారం గ్రామంలో గ్రామంలో సీఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ మండలి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సీఎస్‌పీ జిల్లా కోఆరినేటర్ మాట్లాడుతూ కార్మికులకు 52 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రం -4లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సునిత



మునగాల : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ సంధ్య



నేరేడుచర్ల: దిర్శించర్ల అంగన్‌వాడీ కేంద్రం-3లో..

చిలుకూరు : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 4లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, నాగమ్మ, పద్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

**ముర్రు పాలలో వ్యాధినిరోధక శక్తి అధికం**

మునగాల : చిన్నారులు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, వాటిలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ గన్నవరపు సంధ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 4లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు.

**నేడు మండల స్థాయిలో వారోత్సవాలు..**

ఐసీడీఎస్ కోదాడ ప్రాజెక్ట్ పరిధిలో గల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్**

నేరేడుచర్ల : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతతో పాటు రోగాలకు దూరంగా ఉండొచ్చని అంగన్‌వాడీ టీచరు చంద్రకళ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం- 3లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించి మాట్లాడారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. హరితహారం కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని, క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



సమావేశంలో తహసీల్దార్ సాయాగౌడ్, అధికారులు

మఠంపల్లి : మండలంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ సాయాగౌడ్ కోరారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, నూతన గ్రామపంచాయతీ భవనాలు, బృహత్‌పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాలు, పారిశుద్ధ్యం మెరుగు, తాగు నీటి సరఫరా, అంటువ్యాధుల నివారణ, తదితర పనులపై దృష్టి సారించాలని కోరారు. ఎంపీడీఓ జానకిరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీఓ ఆంజనేయులు, పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సుధాకర్‌నాయక్, ఏపీఓ ఉమాదేవి, ఏఈలు, ఈసీ, టీఏలు ఉన్నారు.

## హామీలకే పరిమితమైన బీఆర్ఎస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న షేక్ ముస్తఫా

హుజూర్‌నగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలకే పరిమితమైందని భవన నిర్మాణ కార్మిక, సీఐటీయూ అనుబంధ సంఘం మండల కార్యదర్శి షేక్ ముస్తఫా విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వెల్ఫేర్ బోర్డులో నమోదైన ప్రతి కార్మికుడికి బైక్‌లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆ సంఘం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శీలం వేణు, పిల్లలమర్రి వెంకన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు చల్లా జయకృష్ణ, తమ్మిశెట్టి రాములు, రామకృష్ణ, నరేష్, గోవింద్, సాయి, వీరనాగేశ్వరరావు, అంజయ్య, అశోక్, శాంతయ్య, శ్రీను, నర్సింహారావు, నజీర్, నాగరాజు, నాగుల్‌మీరా, రాంబాబు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



కోదాడరూరల్ : పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



మునగాలలో జీపీ కార్మికుల సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్



నడిగూడెంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

మునగాల : గత 27రోజులగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. జీపీ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి పర్మినెంట్ చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, నాయకులు మామిడి వెంకన్న, రమేష్, రాజేష్, పరుశరాములు, ముత్తయ్య, వసరం, రఘు, వీరబాబు, నాగరాజు, కత్తి వెంకన్న, రేణుక, ఎల్లమ్మ, నాగరాణి, రాములమ్మ పాల్గొన్నారు.

**పొర్లుదండాలు పెడుతూ నిరసన**

కోదాడరూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని గత 27 రోజులుగా కోదాడ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు మంగళవారం వినూత్నంగా పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. దాదాపుగా నెల రోజులుగా తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు, పంప్ ఆపరేటర్లకు జీతాలు ఇవ్వాలన్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కట్టికోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటి, షేక్ జాకీర్‌హుస్సేన్, వడ్రాణపు తిరపయ్య, నాగేశ్వరరావు, దానియా, సైదయ్య, నాగేంద్రబాబు, శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

**కనీస వేతనాలు చెల్లించాలి**

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించి వారికి కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంటి రవి, మంగళపల్లి మైసయ్య, మోతీలాల్‌నాయక్, దేవదానం, రహీం, గురువారెడ్డి, పాండునాయక్, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు దేవరంగుల వీరన్న, తిరుమలి, సీపీఎం నాయకులు ఎస్‌కె.సైదా, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి అర్చకులు తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.